# ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి



అదనపు బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లను పరిశీలిస్తున్న.జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, నవంబర్21(నమస్తే తెలంగాణ): శాసనసభ ఎన్నికలకు సంబంధించి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొదటి విడుత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లాలోని గుర్తింపు పొందిన ప్రజాప్రతినిధుల సమక్షంలో పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశంహాల్‌లో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, రెవెన్యూ అధికారి హరిప్రియలతో ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన అదనపు బ్యాలెట్ యూనిట్ల పరిశీలన సైతం పూర్తి చేసినట్లు వెల్లడించారు. జిల్లాలోని మల్కాజిగిరి, ఉప్పల్ నియోజకవర్గాలకు అదనంగా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు అవసరం కాగా అందులో మల్కాజిగిరికి నియోజకవర్గానికి బ్యాలెట్ యూనిట్లు 1,096, కంట్రోల్ యూనిట్లు 23, ఉప్పల్ నియోజకవర్గానికి బ్యాలెట్ యూనిట్లు 1,060 కంట్రోల్ యూనిట్లు 15 కేటాయించి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. బ్యాలెట్ యూనిట్లు, వీపీ ప్యాట్లను జిల్లా కలెక్టర్ గౌతమ్ జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో కలిసి ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల పరిశీలకులు జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని ఎన్నికల అధికారులకు సూచించారు.

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ వెల్లడి**

### పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు

మేడ్చల్ కలెక్టరేట్: పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఎన్నికలను పురస్కరించుకొని మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, జాయింట్ ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులు,నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకునే వారి జాబితాను పోటీ చేసే అభ్యర్థులకు అందజేస్తున్నామన్నారు. నూతన ఓటర్ల గుర్తింపు కార్డుల పంపిణీతో పాటు ప్రతి ఓటరుకు సమాచార స్లిప్పులు పంపిణీ చేస్తున్నామన్నారు. పోలింగ్ రోజు విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నామని, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశామని చెప్పారు.ఎంసీసీ నోడల్ అధికారి కృష్ణారెడ్డి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి వంశీమోహన్, ఎన్నికల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కే జవహర్‌నగర్ ప్రజలు జై..



చామకూర మహేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేఆర్‌నగర్ ముదిరాజ్ సంఘం నాయకులు

జవహర్‌నగర్, నవంబర్ 21: జవహర్‌నగర్ ప్రజలు బీఆర్ఎస్‌కే జై కొడుతున్నారని, అభివృద్ధి చేస్తున్న తెలంగాణ ప్రభుత్వానికే మరోసారి పట్టం కట్టడానికే సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కార్పొరేషన్‌లోని బీజేఆర్‌నగర్ 7వ డివిజన్‌లకు చెందిన ముదిరాజ్‌లు 500మంది కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి డివిజన్ అధ్యక్షుడు మెట్టు వెంకన్న ఆధ్వర్యంలో చామకూర మహేందర్‌రెడ్డి, మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆశాకుమారి, రవి, ముదిరాజ్ సంఘం నాయకులు అశోక్, సాయికుమార్, కనకయ్య, ఆంజనేయులు, పద్మారావు, శేఖర్, వెంకటేశ్, బాలరాజు, ఆనంద్, లక్ష్మి, దుర్గ, అధిక సంఖ్యలో ముదిరాజ్ సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయానికి ఎల్ ఈడీ దీపాలు విరాళం

మేడ్చల్, నవంబరు 21: మేడ్చల్ పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయానికి ఎల్ఈడీ దీపాలను దాత సురేశ్ విరాళంగా ఇచ్చారు. రూ.40వేల వెచ్చించి కొనుగోలు చేసిన 12 ఎల్ఈడీ దీపాలను భక్తులు, అయ్యప్పస్వామి మాలదారుల సౌకర్యార్థం అందజేశారు. మంగళవారం ఆలయ నిర్వాహకులకు ఆలయ ప్రాంగణంలో అందజేశారు.



ఎల్ ఈడీ దీపాలను అందజేస్తున్న దాత సురేశ్


## జోరుగా బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం




మేడ్చల్‌లో ప్రచారం నిర్వహస్తున్న కౌన్సిలర్ కౌడె మహేశ్, నాయకులు



మూడుచింతలపల్లిలో ప్రచారం చేస్తున్న డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, పార్టీ శ్రేణులు



బాబాగూడలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, పార్టీ శ్రేణులు.



కీసరలో మంత్రి మల్లారెడ్డి గెలుపు కోసం ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

## ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి




వెంకటాపూర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అనురాగ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 21: ఓటు హక్కు వినియోగంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించేందుకు యువత కృషి చేయాలని అనురాగ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ సి మల్లేశ్ సూచించారు. మండల పరిధి వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఓటర్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, వలంటీర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఎస్ఎంఈ ఏడీ కేసీ చౌదరి

మేడ్చల్ , నవంబర్ 21: విద్యార్థులు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ కేసీ చౌదరి సూచించారు. గుండ్లపోచంపల్లి పరిధిలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నూతన ఆవిష్కరణలు, వ్యవస్థాపకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. సృజనాత్మకత ఆలోచనలతో ముందుకు వస్తే స్టార్టప్ ఇండియా ద్వారా అన్ని విధాలు సహాయ సహకారాలు లభిస్తాయన్నారు. ఎంఎస్ఎంఈ ద్వారా విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకోవచ్చున్నారు. ఎంఎస్ఎంఈ ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారంటీ ప్రోగ్రాం, ముద్ర లోన్స్, స్టార్టప్ ఇండియా తదితర పథకాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో చైర్మన్ నర్సింహారెడ్డి, కళాశాల కార్యదర్శి త్రిశూల్ రెడ్డి, కోశాధికారి త్రిలోక్ రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ మోహన్ బాబు, ప్రిన్సిపాల్ లోకనాథం, సమన్వయకర్తలు శోభన్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఫీడర్ల మరమ్మతు

మేడ్చల్, నవంబరు 21: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ అయోధ్య 11కేవీ ఫీడర్ పరిధిలో బుధవారం చెట్ల కొమ్మలను తొలగించనున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం విధించనున్నట్టు రూరల్ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాలో అంతరాయం విధిస్తున్నామన్నారు. గౌడవెల్లి గ్రామ పరిధిలోని వ్యవసాయ కనెక్షన్లకు సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

## తల్లి మందలించడంతో బాలిక ఆత్మహత్య

మేడ్చల్, నవంబరు 21: బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కండ్లకోయలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...కండ్లకోయకు చెందిన భాస్కర్, సహిర కుమార్తె ముస్కాన్(13)ను ఈనెల 18న తల్లి మందలించిందని ఇంట్లో చీరతో ఉరేసుకొంది. గుర్తించిన కుటుంబ సభ్యులు స్థానికుల సహకారంతో గడియను తొలగించి, ముస్కాన్‌ను కిందికి దింపారు. అస్వస్థతకు గురైన ఆమెను మేడ్చల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

## కరాటేలో అత్వెల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ప్రతిభ

మేడ్చల్, నవంబరు 21: జాతీయ స్థాయిలో కరాటే పోటీల్లో మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ చూపారు. ఇటీవల మేడ్చల్ జరిగిన పోటీల్లో పాఠశాలకు చెందిన 25 మంది విద్యార్థినులు 14ఏండ్లలోపు విభాగంలో బంగారుతో పాటు వెండి, రజత పతకాలను సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులు పాఠశాలలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు